## నేటి నుంచి తిరునక్షత్ర ఉత్సవాలు

**అంబర్‌పేట:** డీడీకాలనీలోని అహోబిలం మఠంలో ఈనెల 22 నుంచి తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మఠం మేనేజర్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 5 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. తిరువర్ధనం, వేద, దివ్య ప్రభానంద పారాయణం, మహా నివేదనం, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై లక్ష్మీ నర్సింహస్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

## రుద్రవికాస్ కుటుంబాన్ని ఆదుకోండి

**కాచిగూడ:** శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన పద్మశాలి కులానికి చెందిన రుద్రవికాస్ (39) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి విజ్ఞప్తి చేశారు. గురువారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ కుటుంబంలో రుద్రవికాస్ తండ్రి గతంలోనే మరణించడంతో ప్రస్తుతం అత్తాకోడళ్లు ఇద్దరు వితంతువులుగా మారి కడు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. రుద్రవికాస్‌కు 9 ఏళ్ల బాబు, ఆరేళ్ల పాప ఉందన్నారు. ఆ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియాతో పాటు రుద్రవికాస్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, తల్లికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కోశాధికారి కోక్కుల దేవేందర్, ఇటె ప్రభాకర్, గంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు


చిన్నారులతో చర్చి నిర్వాహకులు

**అంబర్‌పేట:** బస్తీ చిన్నారులకు అన్ని రంగాల్లో రాణించేలా చొరవ తీసుకుంటామని గోల్నాక బేతెల్ గ్రాస్పెల్ చర్చి నిర్వాహకులు తెలిపారు. బస్తీ చిన్నారులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలిచిన విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులకు పాఠశాల అనంతరం ట్యూషన్లతో పాటు ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు సుధాకర్, వర కుమార్, క్రిస్టో లైట్ తదితరుల పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయండి


ఏఈ సునీల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాజిద్‌హుస్సేన్

**ముషీరాబాద్:** ముషీరాబాద్ ఏక్ మినార్ మసీద్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని భోలక్‌పూర్ మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్ కోరారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఏఈలు సునీల్‌రెడ్డి, సుధామాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ దృష్టికి సైతం తీసుకెళ్లామని ఆయన తెలిపారు.

## ఫీజు బకాయిలు విడుదల చేయాలి

**కాచిగూడ:** విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.4,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని స్కాలర్‌షిప్‌లను రూ.20వేల వరకు పెంచాలని కోరారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసి నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. మూసీ సుందరీకరణ కాదు.. గురుకులాల సుందరీకరణ అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, భూషణ్ భాస్కర్, ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, కిషోర్‌గౌడ్, సత్యపాల్ సింగ్, ప్రదీప్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## 'ఇళ్లు కూల్చి 19 నెలలైంది.. ఇప్పటి వరకు ఇళ్లు ఇవ్వలేదు'



**చిక్కడపల్లి:** గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు త్వరగా ఇళ్లు కేటాయించాలని కార్పొరేటర్ పావని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ హరిచందనకు గురువారం ఆమె వినతిపత్రాన్ని అందజేశారు. బస్తీవాసులకు ఇళ్లు కేటాయించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 19 దళిత కుటుంబాలకు చెందిన ఇళ్లు కూల్చి 19 నెలలైందని ఇప్పటి వరకు ఇళ్లు కేటాయించలేదని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలో ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత వినయ్‌కుమార్, బస్తీ వాసులు ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# గుంతల్.. చింతల్.!

- ఇష్టానుసారంగా తవ్వి వదిలేస్తున్న వైనం
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు


అధ్వానంగా మారిన నింబోలిఅడ్డ రైల్వే అండర్ బ్రిడ్జి రహదారి

**కాచిగూడ:** నిత్యం రాకపోకలు సాగించే రహదారి అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. నింబోలిఅడ్డ రైల్వే అండ్ బ్రిడ్జి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు డ్రైనేజీ మురుగు పారుతూ రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మంచినీటి పైపులైన్ మ్యాన్‌హోల్ల వద్ద నీరు నిలిచిపోయి పైపులైన్లలో చేరి పోల్యూషన్ వాటర్ వస్తోందని తెలిపారు.

### ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి..

ఇటీవల కురుస్తున్న వర్షాలకు గతంలో పైపులైన్ పనులు చేపట్టిన రోడ్డు పూర్తిగా చెడిపోయి అడుగడుగునా గుంతలమయంగా మారడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి వెంట వెళ్లాలంటే ఎప్పుడు..? ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు వాపోతున్నారు.

### అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు...

నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని బీఆర్‌ఎస్ నేత జంగాల అనిల్‌యాదవ్ తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని ఆయన పేర్కొన్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

# మార్వాడీలపై చర్యలు తీసుకోవాలి


ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

**కవాడిగూడ:** హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి జిల్లా శివారు ప్రాంతాలలో ప్రధానంగా మాలలపై దాడులు చేస్తూ దౌర్జన్యాలకు దిగుతూ కులం పేరుతో దూషిస్తున్న మార్వాడీలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యని కలిసి దళితులపై దాడులు చేస్తున్న మార్వాడీలపై చర్యలు తీసుకోవాలని అందజేశారు. ఈ సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.

డాక్టర్ మందాల భాస్కర్, బేర బాలకిషన్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ మోండా మార్కెట్ సమీపంలో ఉన్న ఎస్కే జ్యూవెలర్స్ వద్ద సాయికుమార్ అనే వ్యక్తిపై అకారణంగా దాడి చేసి కులం పేరుతో దూషించిన మార్వాడీలను కఠినంగా శిక్షించాలన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మా సంఘాలు చేసిన నాయకులు డాక్టర్ వీరస్వామి, కొప్పుల అర్జున్, గోపి, సత్యనారాయణ, అరుణ్ కార్తీక్ పాల్గొన్నారు.

# ఆధునిక మొల్ల 'అనిశెట్టి రజిత'


అనిశెట్టి రజిత సంస్మరణ సభలో మాట్లాడుతున్న జూలూరి గౌరీశంకర్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ఆధునిక కాల మొల్ల 'అనిశెట్టి రజిత'అని సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సగర సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల కోసమే ఆమె కలం పట్టారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆమెతో కలిసి పనిచేసే అవకాశం లభించిందన్నారు. సగర సంఘం ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో అనిశెట్టి రజిత నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. 25 ఏళ్ల క్రితమే బీసీలకు రాజ్యాధికారం రావాలని గళమెత్తారని అన్నారు. బహుజనులు రాజ్యాధికారం వైపు పయనించేలా చైతన్యవంతమైన రచనలు చేశారని తెలిపారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ... త్యాగపూరితమైన జీవితాన్ని గడిపిన గొప్ప రచయిత అని కొనియాడారు. బహుజన ఉద్యమానికి నల్లమబ్బు అవుతానని చెప్పిన గొప్ప రచయిత్రి అని గుర్తుచేశారు. ఆమె రాతి పలకల్లో కాదు ప్రజల హృదయాల్లో నిలిచిపోతుందని అన్నారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపరి శేఖర్ సగర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ విశ్లేషకులు బుచ్చన్న, సగర ఆత్మగౌరవ భవన్ ట్రస్ట్ చైర్మన్ మారుతీసాగర్, ప్రధాన కార్యదర్శి సత్యం, కోశాధికారి కుమారస్వామి, మహిళ అధ్యక్షురాలు శ్రవంతి, యూత్ ప్రెసిడెంట్ సురేష్, ఆర్‌బీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి


విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

**అంబర్‌పేట:** విద్యుత్ ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. బతుకమ్మకుంటలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏడీఈ, ఏఈలతో గురువారం ఆమె సమావేశమయ్యారు. డివిజన్ పరిధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభాలను యుద్ధప్రతిపాదకన తొలగించాలని కోరారు. మెరుగైన విద్యుత్ సరఫరాకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న గణేష్ నవరాత్రుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అధికారుల శ్రీనయ్య, నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిపై తీవ్రంగా దాడి చేసిన వీధికుక్క

- తీవ్రంగా గాయపడటంతో గాంధీకి వెళ్లాలని వైద్యుల సూచన



**నల్లకుంట:** వీధికుక్క దాడిలో గాయపడిన ఓ వ్యక్తికి నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో వైద్యులు చికిత్సలు అందించారు. శామీర్‌పేటకు చెందిన ఎ.పెంటయ్య (52) బుధవారం సాయంత్రం వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వీధికుక్క అతడిపై దాడి చేసి గాయపరిచింది. కుక్క దాడిలో అతని ఎడమ కాలి పిక్క కింది భాగం చర్మం పూర్తిగా తొలగిపోయి ఎముక కనిపిస్తుంది. వెంటనే స్థానిక ఆస్పత్రికి వెళ్లగా ప్రాథమిక చికిత్సలు అందించిన అక్కడి వైద్యులు మెరుగైన చికిత్సల కోసం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు బుధవారం రాత్రి 11.30గంటల సమయంలో అతడిని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి తీసుకు వచ్చారు. అతడి కాలికి ఉన్న కుక్క కాటు గాయాన్ని శుభ్రం చేసిన వైద్యులు టీటీ, ఏఆర్వీ, రిగ్ ఇంజక్షన్ ఇచ్చి పంపించారు. కాలికి గాయం తీవ్రంగా ఉండటంతో తదుపరి చికిత్సల కోసం గాంధీ, లేదా ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు.

## రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

**కాచిగూడ:** రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ పీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం ... హయత్‌నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ హసన్ (54) మానసికంగా బాధపడుతున్నాడు. గురువారం మలక్‌పేట రై స్టేషన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'మాతృ వందనం'

**చిక్కడపల్లి:** కామేశ్వరి బహుముఖ ప్రతిభాశాలి అని ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. ప్రముఖ సంస్కృతిక సంస్థ అభినందన ఆధ్వర్యంలో 'మాతృ వందనం'వేడుకలు త్యాగరాయ గానసభలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి డి.కామేశ్వరి, వరలక్ష్మి, రామలక్ష్మి రంగాచార్యులకు మాతృవందనం పురస్కారం ప్రదానం చేశారు. దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ పి.మధుసూదన్‌రావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో హైమవతి భీమన్న, జీవీఎస్ రాజు, కృష్ణకుమారి,లలితారావు, భవాని పాల్గొన్నారు.

## బప్పా ఆగమన్.. ఎత్తెక్కువై నిలిచెన్.!



**వివేక్‌నగర్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్** నిర్వాహకులు శంషాబాద్ నుంచి 18 ఫీట్ల వినాయక విగ్రహాన్ని తీసుకొస్తున్నారు. చిక్కడపల్లి మెట్రోస్టేషన్ కిందకు రాగానే విగ్రహ కిరీటం స్టేషన్ శ్లాబ్‌కి తగడంతో నిర్వాహకులు ఆపేశారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు అక్కడకు చేరుకుని అరగంట కష్టపడి శ్లాబ్ తగలకుండా బయటకు తీసుకొచ్చారు. వినాయకుడి విగ్రహం సాఫీగా వెళ్లడంతో ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వాహనాదారులు ఊపిరి పీల్చుకున్నారు.
– చిక్కడపల్లి

# గణేష్ ఉత్సవాలకు సమన్వయంతో పనిచేయాలి


వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్

**ముషీరాబాద్:** ప్రభుత్వ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ త్వరలో జరిగే గణేష్ చవితి ఉత్సవాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ కోరారు. ముషీరాబాద్ వార్డు కార్యాలయంలో గురువారం జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వినాయక మండపాల వద్ద మురుగు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గుంతల రహదారులకు ప్యాచ్ వర్క్ చేపట్టాలని కోరారు. ప్రతి వీధిలో స్ట్రీట్ వెలిగేలా చూసుకోవాలన్నారు. అడ్డంగా వేలాడుతున్న కేబుల్ తీగలను సరిచేయాలని సూచించారు. ఏపుగా పెరిగిన చెట్లకొమ్మలను తొలగించి వినాయక నిమజ్జన సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.

### అన్ని విభాగాల అధికారులతో వాట్సాప్ గ్రూప్...

◆ బాపూజీనగర్‌లో రోడ్డుపైనే చెత్త రిక్షాలను నిలుపుతున్నారని వాటిని ఇతర ప్రాంతాల్లో నిలిపే విధంగా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులతో కలిసి వాట్స్‌గ్రూప్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమస్యలను ఆ గ్రూప్‌లో పెడితే సంబంధిత శాఖ అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ బీజేపీ అధ్యక్షుడు కంచిముదిరాజ్, నాయకులు మెట్టు వాసు, అనిల్‌కుమార్, సత్యనారాయణ, లక్ష్మణ్, జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 డీఎంసీ రామానుజులరెడ్డి, ఏఎంవోహెచ్ డా. ప్రవీణ, విద్యుత్ శాఖ డీఈ అశోక్, ఏఈలు సునీల్‌రెడ్డి, సుధామా, ఎస్సైలు రాజేష్‌రాంచంద్రారెడ్డి, జలమండలి సెక్షన్ మేనేజర్లు సురేష్, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవ నిర్వహణ సమావేశానికి ఆహ్వానం

23న మండప నిర్వాహకులతో సమావేశం


అడిషనల్ డీసీపీ నర్సయ్యను ఆహ్వానిస్తున్న అంబర్‌పేట బీజీయూఎస్ ప్రతినిధులు

**అంబర్‌పేట:** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 23 గణేష్ చవితి ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమావేశానికి హాజరు కావాలని గురువారం ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, డీఎంసీ మారుతీదివాకర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గ బీజీయూఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మండప నిర్వాహకులతో ఏర్పాటు చేసే సమావేశంలో వేడుకల నిర్వహణపై చర్చిస్తామన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాలు గణేష్ వేడుకలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో గోల్నాక అశోకా ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 6గంటలకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమకంలో నియోజకవర్గ బీజీయూఎస్ కన్వీనర్ అచ్చిని రమేష్, పార్లమెంట్ కోకన్వీనర్ ఆనంద్‌గౌడ్, నియోజకవర్గం కో–కన్వీనర్లు పి.గోవర్ధన్‌రెడ్డి, వెంకటస్వామిగౌడ్, ఎస్.నర్సింగ్‌రావు, చుక్కా జగన్ తదితరులు పాల్గొన్నారు.

# తంగిరాల చక్రవర్తి గొప్ప సాహితీవేత్త


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంస్మరణ సభలో పాల్గొన్న ప్రముఖులు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** గొప్ప సాహితీవేత్త తంగిరాల చక్రవర్తి అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి రచయిత తంగిరాల చక్రవర్తి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కొలకలూరి ఈనాక్ మాట్లాడారు. ఉద్యోగంలో ఎంత నిబద్ధతతో ఉండేవారో స్నేహం, బంధుత్వంలోనూ అంతే నిబద్ధతతో ఉండే వారన్నారు. సాహిత్యకారులను ప్రోత్సహిస్తూ అందరితో సన్నిహితంగా ఉండేవారని గుర్తు చేశారు. ప్రముఖ కవి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ... అందరి మధ్య తిరిగేవాడు అకస్మాత్తుగా మృతి చెందడం భాదకరం అన్నారు. ఆయన ఒక కవి మాత్రమే కాదు. అనేక సంస్థలతో సంబంధాలు కొనసాగించేవారని గుర్తు చేశారు. తెలంగాణ సాహిత్య ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలకపల్లి రవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, డాక్టర్ సలీమ, అనంతోజు మోహనకృష్ణ, బుచ్చిరెడ్డి, తంగిరాల చక్రవర్తి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాలాలో మట్టిని తొలగించండి

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- రత్నానగర్ నాలా రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేయాలని ఆదేశం
- ఎస్ఎన్‌డీపీ, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులతో కలిసి రత్నానగర్‌లో పర్యటన


ఎస్ఎన్‌డీపీ, ఈఈహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు, రత్నానగర్‌బస్తీ వాసులతో సమావేశమైన ఎమ్మెల్యే


హుస్సేన్ సాగర్ నాలాను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**నల్లకుంట:** నల్లకుంట డివిజన్ రత్నానగర్ బస్తీని ఆనుకుని ప్రవహిస్తున్న హుస్సేన్ సాగర్ నాలా రిటైనింగ్ వాల్ లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో వరద సమస్యలు తలెత్తేవి. ఈ క్రమంలో అప్పట్లో నాటి మున్సిఫల్ శాఖ మంత్రి కేటీఆర్ స్థానిక ఎమ్మెల్యే కాలేరుతో కలిసి బస్తీలో పర్యటించారు. నాలాకు రిటైనింగ్ వాల్ లేకపోవడాన్ని గమనించిన నాటి మంత్రి నాలాను ఆక్రమించిన ఇళ్లు కొంత మేర తొలగించి రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతామని చెప్పారు. అందుకు బస్తీలోని చాలా మంది అంగీకరించారు. ఈ క్రమంలో నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టగా కొందరు ఇళ్లు కూల్చివేయవద్దని అడ్డుకున్నారు. దీంతో కొన్ని ఇళ్లను వదిలేసిన ఎస్ఎన్‌డీపీ, జీహెచ్ఎంసీ అధికారులు దాదాపు 70 శాతం రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణ సమయంలో జేసీబీలు, సిమెంట్ క్రషర్ వాహనాలు నాలాలోకి వెళ్లి రావడానికి వీలుగా నాలా ప్రహారి వెంట మట్టినిపోశారు. పనులు కొంత మేర మిగిలి ఉన్నందుకు పూర్తి స్థాయిలో వాల్ నిర్మాణం పూర్తయిన తర్వాత నాలాలోని మట్టిని తొలగిస్తామని అధికారులు మట్టిని అలాగే వదిలేశారు.

◆ ఇదిలా ఉండగా బస్తీ పెద్దలు మిగిలిన ఇళ్ల వాసులతో మాట్లాడి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఎట్ట కేలకు ఆ మిగిలిన ఇళ్ల వాసులు కూడా అంగీకరించడంతో ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం కోసం ధరఖాస్తులు స్వీకరించారు. కాని వాళ్లకు ప్రభుత్వం నుంచి పరిహారానికి సంబంధించిన చెక్కులు జీహెచ్ఎంసీ కమీషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. వాళ్లందరికి చెక్కులు అందకపోవడంతో కొందరు ఇళ్ల ఖాళీ చేయలేదు. దీంతో మిగిలిన రిటైనింగ వాల్ పనులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ క్రమంలో.. ఇటీవల కురుస్తున్న వర్షాలకు హుస్సేన్ సాగర్ నాలాలో వరద నీటి ఉధృతి పెరిగింది. రిటైనింగ్ వాల్ పూర్తిగా లేకపోడంతో వరద నీరు బస్తీలోకి వస్తుందనే భయంతో, నాలాలో ఉన్న మట్టిని తొలగింపచేయాలని స్థానికులు ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకు వెళ్లారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎస్ఎన్‌డీపీ, జీహెచ్ఎంసీ, హైడ్రా, రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం రత్నానగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రిటైనింగ్ వాల్ పెండింగ్‌లో ఉన్న నాలాను పరిశీలించారు.

◆ నాలాలో వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో పాటు నాలా ప్రహారిని ఆనుకుని మట్టి కుప్పలు ఉండడాన్ని గమనించిన ఎమ్మెల్యే నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగింపచేయాలని అధికారులు సూచించారు. అలాగే మిగిలిన ఇళ్ల వాసులు చెల్లించాల్సిన పరిహారం చెక్కులను అందజేసి, పెండింగ్‌లో ఉన్న నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు కూడా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అనంతరం బస్తీలోని కమ్యూనిటీ హాల్‌లో అధికారులు, బస్తీ పెద్దలతో సమావేశమైన ఎమ్మెల్యే స్థానికంగా నెల కొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలా బ్రిడ్జి కింద ఉన్న తూముల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని, వాటిని తొలగింపచేస్తే వరద నీరు సజావుగా వెళుతుందని ఎమ్మెల్యేతో చెప్పారు. ఆ వ్యర్థాలను తొలగింపచేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

◆ అలాగే బస్తీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని బస్తీ వాసులను కోరారు. తద్వారా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ఎస్ఎన్‌డీపీ అధికారులు, జీహెచ్ఎంసీ ఈఈ ప్రవీణ్, ఏఈ కృతి, జలమండలి మేనేజర్ భావన, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నరేందర్, రత్నానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంబి. కిషోర్ కుమార్, పింజరి నర్సింగ్ రావు, రాము యాదవ్, వీరయ్య గౌడ్, పాదం వెంకటేష్, సతీష్ చంద్ర గౌడ, దూదిగామ లింగం, బస్తీ వాసులు పాల్గొన్నారు.